పిల్లలకు పుస్తకాలు పంపిణీ ..

పిల్లలకు పుస్తకాలు, సర్టిఫికెట్లను అందజేస్తున్న డాక్టర్ మహేందర్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ, అక్టోబర్ 8: ప్రతి అయిదు మంది పిల్లల్లో ఒకరికి మానసిక ఆరోగ్య సమస్య ఉన్నదని మానసిక నిపుణులు డాక్టర్ జి. మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో దోమలగూడలోని రామకృష్ణ మఠం బాలల సేవా విభాగంలో మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక సమస్యలపై చిత్ర లేఖనం పోటీలలో గెలుపొందిన వారికి లయన్ రెండవ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ జేటీ విద్యాసాగర్, జోనల్ చైర్ పర్సన్ లయన్ సీహెచ్ గోపాలకృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నవభారత్ అధ్యక్షుడు లయన్ బెల్లంకొండ వినయ్, డాక్టర్ పి. స్వరూపరాణి, లయన్ జి. కృష్ణవేణి, లయన్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ బహుమతులు, పుస్తకాలు, అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక సమస్యలపై అవగాహన చాలా అవసరమని అన్నారు. ప్రీస్కూల్, పాఠశాల వాతావరణంలోనే మెజారిటీ ప్రవర్తన రుగ్మతలను నివారించడం సాధ్యమవుతుందని అన్నారు. పిల్లలు ప్రపంచానికి అత్యంత ముఖ్యమైన ఆస్తి అని, వారికి పోషణ, ఒంటరితనం మన బాధ్యతను గుర్తు చేయాలని, అప్పుడే మన పిల్లలు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని అన్నారు. తీవ్రమైన మానసిక రుగ్మతతో 20 మిలియన్‌ల మంది కౌమార దశలో ఉన్నారని, 90 శాతం మంది పిల్లలు ప్రస్తుతం ఎటువంటి నిపుణుల సేవలను పొందడం లేదని అన్నారు. మానవ వనరుల అభివృద్ధితో పాటు అవసరమైన ఆరోగ్యం, పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రొఫెసర్ బాలగోపాల్ కృషి ప్రశంసనీయం

పుస్తకాలను ఆవిష్కరిస్తున ప్రొఫెసర్ తిరుపతయ్య తదితరులు

చిక్కడపల్లి, అక్టోబర్ 8 : మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రొఫెసర్ బాలగోపాల్ ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మానవ హక్కుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల నేత బాల గోపాల్ సంస్మరణ సభ జరిగింది.ఈ సందర్భంగా వాకపల్లి, ఫాసిజం రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ తిరుపతయ్య, ప్రొఫెసర్ ఖాంకాన్ సువాన్ హోసింగ్, ప్రతిక్ సింహ పాల్గొన్నారు.

నందికంటి శ్రీధర్‌కు సత్కారం ..

తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్‌గా నియమితులైన నందికంటి శ్రీధర్‌ను జంట నగరాల మహేంద్ర సంఘం కోశాధికారి రేశం మల్లేశ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నేతలు ఆదివారం ఆయన నివాసంలో కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. – ముషీరాబాద్, అక్టోబర్ 8

మరోసారి భారీ మెజారిటీ సాధిస్తాం

- నిత్యం జనం మధ్య ఉండే తనకే ప్రజామోదం
- ముషీరాబాద్ డివిజన్‌లో పాదయాత్ర సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్

వైఎస్ఆర్ పార్కు కాలనీలో పర్యటించి స్థానికుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అక్టోబర్ 8: నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తూ పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన తాను వచ్చే ఎన్నికల్లో ముషీరాబాద్ ప్రజల మద్దతుతో భారీ మెజారిటీ సాధిస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. పని చేసే వారికే ప్రజా మద్దతు ఉంటుందని, చుట్టపు చూపుగా వచ్చిపోయే వారిని ప్రజలు ఆదరించబోరని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ముషీరాబాద్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పలు బస్తీల్లో నేరుగా ప్రజల వద్దకు వెళ్లి మీ బస్తీల్లో తాగునీరు సరిపడా సరఫరా అవుతుందా, ఏమైనా సమస్యలు ఉన్నాయా, సంక్షేమ పథకాలు అందినాయా అంటూ ఆరాతీశారు. స్థానికులు చెప్పిన పలు సమస్యను విన్న ఆయన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బస్తీల పర్యటనల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు మెరుగైన సౌకర్యాలకల్పన కోసమే కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి ముషీరాబాద్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. గత రెండు దశాబ్దాలుగా డ్రైనేజీ పైపులైన్‌ల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లనే లీకేజీ సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. దశలవారీగా పెండింగ్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. ఇటీవల డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలో దాదాపు అన్ని బస్తీల్లో కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యలు పరిష్కారం చూపుతామని, ఇందుకోసం నిధులుసైతం మంజూరు చేయించి టెండరు ప్రక్రియ పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, నర్సింగ్ ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, వి. సుధాకర్‌గుప్త, సాంబశివరావు, రజిని, శ్రీధర్‌గౌడ్, బి. శ్రీనివాస్, బాబురావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండ మురళిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముదిగొండ మురళికి సత్కారం..

జిల్లా వెనకబడిన తరగతుల సేవా కో ఆపరేటివ్ సొసైటీ సభ్యునిగా రాంనగర్ డివిజన్‌కు చెందిన ముదిగొండ మురళి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని ఖరారు చేసిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటన విడుదల చేశారు. మురళి ఏడాది పాటు జిల్లా వెనకబడిన తరగతుల సేవా కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యునిగా పని చేయనున్నారు. ముఖ్యంగా రజకులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు సక్రమంగా అర్హులకు అందేలా సభ్యులు పని చేయనున్నారు. కాగా మురళిని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం తన కార్యాలయంలో సత్కరించారు. రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులపాటి మోజస్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ ..

క్రికెట్ కిట్లను పంపిణీ చేసిన ముఠా జయసింహ

చిక్కడపల్లి,అక్టోబర్ 8 : క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. ఆదివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని టీఆర్టీ గ్రౌండ్స్‌లో క్రికెట్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జయసింహ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోకవర్గం పరిధిలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రికెట్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 20 టీంలకు కిట్లను అందించారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని క్రికెట్ టీంలకు క్రికెట్ కిట్‌లను అందజేస్తామని జయసింహ వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, శ్రీధర్‌రెడ్డి, చాణక్యరెడ్డి, రవిశంకర్‌గుప్తా, ముఠా శివా సంహ, వల్లాల శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఎస్టీ ప్రేమ్, శ్రీరామ్, జహంగీర్ పాల్గొన్నారు.

గుర్రం జాషువా సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్

గుర్రం జాషువా సంస్మరణ సభ

ముషీరాబాద్, అక్టోబర్ 8: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ప్రముఖ కవి, పద్మభూషణ్ గుర్రం జాషువా సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని గుర్రం జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కవులలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాధించుకున్న గొప్ప కవి గుర్రం జాషువా అని కొనియాడారు. తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని ముఢాచారాలను రూపుమాపడానికి గుర్రం జాషువా ఎనలేని కృషి చేశారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కథక్ నృత్య గురు పండిట్ అంజిబాబు, వేమరాజు విజయ్‌కుమార్, నీలా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ సాగర్ నాలాలో మృతదేహం లభ్యం

చిక్కడపల్లి,అక్టోబర్ 8 : చిక్కడపల్లి పోలీసులు గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం చేసుకున్నారు. సీఐ పిడమర్తి నరేశ్ తెలిపిన ప్రకారం.. చిక్కడపల్లి హుస్సేన్ సాగర్ బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం మృతదేహం కొట్టుకొచ్చిందని సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాలా నుంచి వెలికి తీశారు. మృతుడి వయస్సు 50ఉండి, 5. 7 అడగుల ఎత్తున ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసును ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కవాడిగూడ, అక్టోబర్ 8: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నాగరాజురెడ్డి తెలిపిన ప్రకారం.. యూపీకి చెందిన మనోజ్‌కుమార్ సింగ్ (55) పదేండ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బన్సీలాల్‌పేటలోని సీసీ నగర్‌లో ఉంటూ కూలీపని చేస్తున్నాడు. ఆయన భార్య యూపీలోనే ఉంటుంది. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మనోజ్ కుమార్ సింగ్ ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ప్లాస్టిక్ వైరుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్ల పొదల్లో ఉరేసుకొని..

కవాడిగూడ, అక్టోబర్ 8: గుర్తు తెలియని ఓ వ్యక్తి చెట్ల పొదల్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్ఐ నాగరాజురెడ్డి కథనం ప్రకారం.. బన్సీలాల్‌పేట పెట్రోల్ బంక్ వెనుక భాగం డబుల్ బెడ్‌రూం డీ క్లాసు ఎదుట ఉన్న చెట్లల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని కనిపించాడంటూ స్థానికులు 100 నంబర్‌కు కాల్ చేసి సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతుడి వయస్సు 55 ఏండ్లు ఉంటుందని చెప్పారు. కాఫీ కలర్ చొక్కా, ఆకుపచ్చ టీ షర్ట్, బ్రౌన్ కలర్ షాట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.